# "బడుగు పేదను, బాబయ్యా!"

సరిగ్గా ప్లీడరుగారి షష్టిపూర్తి వుత్సవాలు దగ్గిర పడుతూండగానే నేను దూర గ్రామాలు వెళ్ళవలసి వచ్చింది. తిరిగి వచ్చేనాటికి వుత్సవాలు ముగిసి నాలుగు రోజులు గూడా గతించినవి. ఆ రాత్రి వారింటికి వెళ్ళి నా అభివాదాలు తెలుపుకొని పిచ్చా పాటీ మాట్లాడుతూ కూచున్నా. ఆయన ప్రాక్టీసు విరమించుకొన్నాడు—షష్టిపూర్తి నాడే. కోకొల్లలుగా ధనం ఆర్జించాడు. విరివిగా దానధర్మాలు చేశాడు. జీవితాన్ని ఒకసారి వెనుదిరిగి చూసుకోగల సుదినాలను పోగుజేసుకొన్నాడు.

"మీ కోర్టు అనుభవం మొత్తంలో-ఆశ్చర్య కరమైందీ, మా వంటి వాళ్ళకు ఆసక్తి కలిగించేది -ఏం కేసండీ?" అని నేను ప్రశ్నించాను.

ప్లీడరుగారు అదొక విచిత్రమైన చూపు నా వైపు విసిరారు. నోట్లో చుట్టను కిందికి వదిలేశారు. తోటలో వెన్నెల వంక ఒకసారి చూసి- 'అవును, ఒక పెద్ద మోసకారి కేసు నాకు తెలుసు. అంటే అందులో నాకు వకాల్తానామా వున్నది. తీరా కేసు గెల్చింతర్వాత గాని ఆ వ్యక్తి నైజగుణం నాకు తెలిసి రాలేదు. నేను పప్పులో కాలువేశాను. ఆ వ్యక్తి యింకా బతికే వున్నాడు ఇక్కడే వున్నాడు"-అన్నాడు.

"ఇక్కడా?"

"ఆయింట్లో-"

ప్లీడరుగారు వేలుతో చూపించిన పెద్దమేడ నీలి నాయుడిది. ఆయన షష్టిపూర్తిపుత్సవాల కమిటీలో ప్రముఖ సభ్యుడిది.

"ఎవరూ....? నీలి........ నాయుడా?"

"అవును-అతగాడే...."

ఇద్దరం చాలా సేపు మాట్లాడుకోలేదు మళ్ళీ చుట్ట వెలిగించి ప్లీదరుగారు కథలాగా చెప్పటం ప్రారంభించారు.

*　　*　　*

'మీరంతా షష్టిపూర్తి కమిటీ అని నా అనుమతికోసం వచ్చినప్పుడు సభ్యుల జాబితా చూపించారు. జ్ఞాపకముందా? నేను యీ హడావిడి వుత్సవాలకు అప్పట్లో వైముఖ్యం కనపరిచాను. ఎందుకో తెలుసా? ఈ ప్రబుద్ధుడి పేరు అందులో ప్రముఖంగా వుండటంవల్లనే. ఇప్పటికైనా మీ కమిటీవాళ్ళు డబ్బు లెక్కలు చూసుకొంటే, సగం యీ మహానుభావుడే స్వాహా చేసినట్లు తేలుతుంది."

కుండ బద్దలు గొట్టినట్లు కల్లా కపటం లేకుండా మనసులో వున్నది వెళ్ళగక్కే స్వభావం ప్లీడరుగారిది. జన్మతః నిజాయితీపరుడు. దయా దాక్షిణ్యాలు ఆయన ఆభరణాలు. అయితేనేం, సత్యం చెప్పవలసినచోట ఆయన అసత్యవాదుల పాలిట సింహ స్వప్నం. ధనార్జన కోసం అన్యాయపు కేసుల్ని ఎన్నడూ పట్టి ఎరగని ప్లీడరు నా జీవితానుభవంలో యీయ నొక్కడే అని వక్కాణించగలను. ధర్మ నిరతితో ప్రతిఫల మాశించకుండా ఆయన ఎందరి పేదల కేసులో చేపట్టాడు. ఇటువంటి వున్నతాదర్శాల మూర్తిని శంకించటమా? నీలి నాయుడిని గురించి ఆయన ఆ కిందటి క్షణంలోనే అన్న మాటలు నన్ను కలిచివేసినవి. ఎందువల్లనంటే-నీలి నాయుడు వృద్ధుడు. ధనవంతుడైన నిగర్విగా మా వూర్లోనే పేరొందినవాడు. పెద్దలకుగాని పిన్నలకుగాని సదా చిరునవ్వుతో, పలుకరించగానే నమస్కరిస్తాడు, కోపం తెచ్చుకోడు. కలుపుగోలుతనం అతనినుండి నేర్చుకోవాలి. "ఏదో బడుగు పేదను బాబయ్యా. తమ ఆశీర్వచన బలంవల్ల యీనాటి కిట్లా వున్నాను" అని నీలినాయు డన్నప్పుడు ఆ చేతుల మోడ్పులు శత్రువుల్ని సైతం నిరస్త్రుల్నిచేసే ఆ వినయానికి - ఎవరైనా యిట్టే ముగ్ధులైపోతారు. అందులో అతిశయోక్తి ఏమీ లేదు. కాని ఒకటి మాత్రం నిజం- నీలి నాయుడు కుర్రకారుతో కలిసినంతగా - పెద్ద వాళ్ళతో - అంటే తన యీడువాళ్ళతో కలియలేడు. పెద్ద మనుషులంతా

అతనంటే ఎడముఖం పెడముఖంగా పోయే విషయం నేను గ్రహించని సంగతి మాత్రం కాదు.

నా సందేహాలను క్షణంలో ఆకళింపు చేసుకొన్నట్లుగా ప్లీడరుగా రన్నారు.

"తన యీడువాళ్ళతో కలియటానికి జంకే పెద్దమనిషిని అర్థం చేసుకోటానికి మనస్తత్వ శాస్త్రజ్ఞులవద్దకు పోనక్కర్లేదు. అతని పాత జీవితంలోకి తొంగి చూస్తే చాలు. నేను తిన్నయింటి వాసాల లెక్కబెట్టేవాణ్ణి కాదని నీకు తెలుసు. మరి నా మిత్రుడిగా మెలుగుతున్న ఒక పెద్దమనిషిమీద రహస్యంగా నిందారోపణ చెయ్యటం మంచిదా? అది మీ సంస్కృతికి లోపం కాదా అంటావేమో? కాదని అంటాను. నేను సత్యాన్ని దైవంగా కొలిచేవాణ్ణి. నాయందు నమ్మకమున్న మీవంటి కుర్రవాళ్ళకు గూడా నా సలహా అదే."

ఇక ప్లీడరుగారు అసలు కథను ప్రారంభించారు. నా సందేహాలన్నీ పటాపంచలై పోయినవి.

"అసలు అతని పేరు నీలి నాయుడు గాదు. అతని పేరు - పోలిగాడు! అతను చెప్పుకొంటున్నట్లే పుట్టటం బడుగు పేదగా పుట్టాడు. ఆనాటి గోచి పాతనుండి యీనాటి మేడవరకూ నడిచిన చరిత్రే పోలిగాడిని నీలి నాయుడనే పెద్ద మనిషిగా మార్చింది. ఒక నిరుపేద - తన నిష్ట దౌర్భాగ్యంనుండి విముక్తి పొంది భాగ్యవంతుడు కావటం గొప్ప విశేషమే. కాని పోలిగాడనే నీలి నాయుడు నడిపించిన చరిత్ర మాత్రం, మానవుడిని గర్వింపజేసే చరిత్ర కాదు. తోటి వాళ్ళకు గొప్ప మానవ లక్ష్యాలవైపు పురిగొల్పేది గాదు. పోలి — నీలిగా మారింది మానవుడికి మానవుడిమీద అవిశ్వాసం రగులుగొలిపే రాక్షస తాంత్రిక పద్ధతులతో.

పోలిగాడు గోచిపెట్టుకొని వార్పులో పని వాళ్ళకు అన్నపు డబ్బాలు, టిఫిన్ మూటలు మధ్యాహ్నాల్లో మోసుకెళ్ళుతున్న వయసులోనే నాకు తెలుసు. వాడి కళ్ళల్లో, మంచి గుడ్డల్ని వేసుకొన్న వాళ్ళమీద పట్టరాని ద్వేషం తాణికిస లాడుతుండేది. శాంతం వినయం వాడి రక్తంలో అప్పటికిలేవు. ఎప్పుడూ ఎవరినైనా తిడుతుంటేగాని వాడి అక్కసు తీరేదిగాదు, కాని ఒక విశేషం. ద్వేషంతో వాడు గుడ్డివాడై పోలేదు. ఎప్పుడెప్పుడు తను గూడా యింత ధనం ఆర్జించి, కార్లల్లో తిరిగే అదృష్టవంతులవలె ఆనందం సౌఖ్యం అనుభవిద్దామా అని వాడిని వెనకనుంచి దయ్యం తరుముతున్నది. విశ్వాసంగా,

నిరాడంబరంగా పనిజేస్తే తనవంటి సోదర మానవ ప్రేమలేని దౌర్భాగ్యుడు త్వరలో చాలినంత ధన మార్జించటం కల్ల అని వాడు గ్రహించాడు. దానితో వాడు మానవుడి ఆత్మను కోల్పోయాడు. పూర్తి సైతాన్‌గా మారిపోయాడు.

వాడి మొదటి దొంగవేషం తనతోటి పేద వాళ్ళమీదనే ప్రయోగించాడు. ఒక రోజున హఠాత్తుగా వాడు రోజూ మోస్తున్న టిఫిన్ కారియర్ డబ్బాల్ని మాయం చేశాడు. బిక్క ముఖంవేసి వీడు హార్బరు మెకానిక్కుల్నీ, కూలీలనూ తెలివిగా మోసంచేసి గోతిలో తోశాడు. "ఏరా, పోలిగా—టిఫిన్ డబ్బాల్ని ఏం జేశావురా?" "బడుగు పేదను బాబయ్యా. రౌడీ నంజకొడుకులు తన్ని నాగేసుకున్నారు బాబయ్యా" అని వలవలా ఏడ్చాడు. ఆ రోజుల్లో హార్బరుకు పోయే దారిలో ఫ్యాక్టరీ మలుపులనిండా జూదగాళ్ళు, తాగుబోతులు తందనాలు తొక్కుతుండేవాళ్ళు. "అరే, ఆ రౌడీ లెవరో మాకు చూపించరా—" అని ఒక మెకానిక్కు నిలదీశాడు. "లేదు బాబయ్యా తాగుమోతాళ్ళు. నన్ను తగిలేస్తారు. బయవేస్తుందదీ బాబయ్యా. బడుగు పేదోణ్ణి"

"చెప్పవేరా" అని నాలుగు అంటించాడు కడుపుమండిన ఆ మెకానిక్కు. ఆ మర్నాటి నుంచీ పోలిగాడు ఆ చాయలకు పోవటం మానేశాడు.

ఇతర్ల నోళ్ళు కొట్టి సంపాదించిన మొదటి సొత్తును పోలిగాడి తల్లి రొక్కంగా మార్చింది. అది వాడి మొదటి పెట్టుబడి. ఈ పెట్టుబడినే వాడు రూపాయికి పావలా వడ్డీల కింద రోగాలు వచ్చి పనులకు పోని పేద కూలీల మధ్య చలామణి చేయసాగాడు.

ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే పోలిగాడు నా పరిచయంలోకి వచ్చాడు. ఇక్కడే నేను పొరబాటులో యిరుక్కున్నానని మొదట్లో చెప్పింది.

క్లబ్బు రోడ్డు మీద ప్రతి దినమూ సంధ్యవేళ ఒక కారు వేగంగా పోతూ వుండేది. ఆ పెద్ద కారు పేరు మోసిన డాక్టరుగారిది. ఆయనకు బోలెడంత ప్రాక్టీసు—అంతా ధనికుల్లోనూ, వేసంగి దినాలకు విడిదిగా వచ్చిన జమీందారీ యిళ్ళలోనూ, క్లబ్బు రోడ్డుమీదుగా ఆ కారు బీచిరోడ్డుకు మళ్ళి, జన సంచారం లేని వీధిలో యింకా జోరుగా పోతుండేది. ఈ ప్రైవేటు డాక్టరు ఏ కారణం వల్లనో పట్టణంలోని స్థానిక పెద్ద మనుషుల్తో చెప్పుకోదగ్గ స్నేహిత వర్గాన్ని సంపాదించలేదు. అందువల్ల ఆయన—అపరిచితులల్లో కొద్దిమంది అతనికి అకారణ శత్రువులుగా వున్నారు. ఒక రోజున యీయన కారు కిందే పోలిగాడు పడ్డాడు. ఇది బీచి రోడ్డులో జరిగిన వుదంతం. కారు టక్కున ఆగిపోయింది.

పైర్లముందు తాకీ తాకనట్లుగా పోలిగాడు మాటామంతీ లేకుండా పడివుండగా డాక్టరుగారంటే పడని కొందరు పెద్దమనుషులు చూశారు. పోలిగాడిని లేవనెత్తి తన కార్లోనే వేసుకొని నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్ళాడు డాక్టరు. అక్కడి నుంచే పోలీసులకు కబురు పంపించాడు గూడా.

ఆస్పత్రిలో పోలిగాణ్ణి పరీక్షించారు. వంటిమీద గాయాలైతే లేవు. అయితే, వాడి నోటిమాట పడిపోయింది. చాలా తీవ్రమైన "షాక్" వల్ల మాట పోయిం దనవచ్చు అన్నారు డాక్టర్లు. వాడి చూపుల్లో భయాతురత; ఎవరైనా సమీపించినపుడు బయటికి వినబడేటంత వేగంగా వాడిగుండె కొట్టుకొనేది. పోలీసులు—మేజిస్ట్రేటు కోర్టులో డాక్టరుమీద ఛార్జీ దాఖలు చేశారు. డాక్టరంటే పడని కొందరు పెద్ద మనుషులు యీ అదను చూసుకొని, నా వద్దకు వచ్చి—యీ పేదవాడి కేసు మీరు పట్టాలిసిందే—అని మొరాయించారు. ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగిందని తోచినా వుడుకు రక్తంతో కోర్టులోకి దూకే ఆనాటి నా మనస్తత్వానికి డాక్టరు పూర్తిగా దోషిలా కనిపించాడు. అసిస్టెంటు ప్రాసిక్యూటరుతోపాటు నేనూ పోలిగాడి తరఫున కోర్టులోకి పోయాను. డాక్టరు డిఫెన్సు పెట్టుకోలేదు. మేజిస్ట్రేటు ఐదొందల రూపాయల జరిమానా వేశాడు. ఈ జరిమానా అటుంచి, పోలిగాడికి పెద్ద మొత్తం నష్టపరిహారం యివ్వాలనే నేను వాదించాను. "ఎంత?" అన్నాడు డాక్టరు. ఆయన నోరు మెదిల్చింది ఆ ఒక్క ప్రశ్నతోనే. నేనన్నాను— "నాలుగువేలు." డాక్టరు మారు మాట్లాడలేదు. కోర్టులో జరిమానా, ఆ పైన పరిహారం "నాలుగు వేలు" చెల్లించాడు. నన్ను డాక్టరు శత్రువులంతా "దీనబంధు" అన్నారు; ఆకాశాని కెత్తారు. వాళ్ళ యింగితాలు వేరని నా కప్పటికి గ్రాహ్యం కాలేదు.

ఈ నాలుగు వేల పెట్టుబడితో పోలిగాడు ఏమిచేశాడో గాని, ఆ తర్వాత నేను షికారు పోయి తిరిగి వస్తూండగా, వాడూ వాడి తల్లీ బిగ్గరగా మాట్లాడుతూ నవ్వుకుంటూ పోతూండగా కానవచ్చారు. ఆ మాట్లాడేది వాడేనా అని నాకు సందేహం కలగటం సహజమే గదా. పిలుద్దామని నా చేతి కర్ర వూపాను. ఇద్దరూ గిరుక్కున ఒక పక్క సందులోకి వెళ్ళిపోయారు. అందులో సందేహం లేదు. ఆ నవ్వువాడిదే నా మీద నాకే జాలేసింది. డాక్టరుగారికి ఘోర అపచారం చేశానేమో నని జంకు వేసింది. ఆ తర్వాత మాటవచ్చి వుండవచ్చు నని సమాధాన పరచుకొన్నాను. కాని నా ఆందోళన ఆందోళన గానే వుండి పోయింది. వాడికి లభించిన గాలిపాటు ధనం నా వల్లనే అయినా ఆ మోసకారి

నన్నెప్పుడూ సమీపించ లేదు. మాట మాత్రంగా కూడా కృతజ్ఞత తెలుప లేదు.

ఆ మరు సంవత్సరం హఠాత్తుగా డాక్టరుగారు నేను ప్రయాణిస్తున్న పెట్టెలో రైల్లో తటస్థ పడ్డారు. ఆ కేసు తర్వాత ఆయన మన పట్నంలో నివసించటం, ప్రాక్టీసు చేయటం బొత్తిగా మానేశాడని చెప్పటం మర్చానేమో. ఆయనే నన్ను పలకరించాడు. నేను మాటలమధ్య పోలిగాడికి పోయిన మాట తిరిగి వచ్చిందని చెప్పాను. ఆయన అది విని ఒక చిరునవ్వు నవ్వి- "అసలు పోతే గదా, తిరిగి వచ్చిందనటానికి" అని నా వంక చూశారు.

"మరి ఆస్పత్రిలో పరీక్షా, ఆ తంతూ—'

"అంతా శుద్ధ మొరటుతనం-తొందరపాటు- తెలివితక్కువ, అనుభవ రహితం-!" డాక్టరుగారు ఆయన లెదరుకేసు తెరిచి, యీ విషయంమీద రాసిన ఒక వ్యాసాన్ని మెడికల్ జర్నల్‌నుంచి ఎత్తి చూపారు. బండి నడిచినంత సేపూ నేనాయన ముఖం చూడలేక, ఆ జర్నల్‌లో తలదూర్చి గడిపేశాను. ఆయన దిగిపోతున్నారు. క్షమార్పణ వేడుకోవాల్సిన క్షణం వచ్చింది.

"డాక్టరుగారూ, క్షమించాలి. చాలా ప్రమాదభరితమైన పొరబాటు జరిగింది. నా గర్వమే అందుకు కారణమై వుండవచ్చు. నన్ను క్షమించగలరా?"

......నవ్వి అన్నారు.

"మీరు వుదారులు. దేన్ని నిజమని నమ్మారో- దానిని దైవ స్వరూపంగా కొల్చారు. మీ తోటి ప్లీడర్లలో ఐచ్ఛికంగా, ఏమీ ఆశించకుండా- ఎంతమంది పేదలకు కోర్టులలో సాయం చేస్తున్నారో చెప్పమనండి, మీకు మీ ఆత్మసాక్షి. దాన్ని నేను ఖండించను."

రైలు కదిలింది. నా హృదయం ఆవేదనా భరితమైపోయింది. ఆయన హృదయ వైశాల్యానికీ, అజాతశత్రుత్వానికి నాలో నేను నమోవాకాలర్పించాను. ఇంటికి చేరిందే తడవుగా, నాలుగువేల రూపాయలకు చెక్కు రాసి మా బ్యాంకు ద్వారా ఆ డాక్టరుగారికి పంపాను. కాని అది తిరిగి వచ్చింది- "మీకు అవసరం వుంటుంది. క్షమించి తీసుకోండి"- అని డాక్టరుగారి సంతకం వుంది. ఆ వెంటనే నేను యీ విషయం పోలీసులకు రిపోర్టిచ్చాను. ఆస్పత్రి సూపరింటెండెంటుతోనూ, డైరెక్టరుతోనూ వుత్తర ప్రత్యుత్తరాలు జరిపాను. దానికి సంబంధించిన "లా"లో, చట్టాల్లో చాలా లోపాలున్నాయి. ఆ కేసును తిరిగి తోడదీయటం సాధ్యపడలేదు.

ఆ పైన నాలుగు లేక ఐదు సంవత్సరాల తర్వాత- అప్పటిదాకా అదుపు లేని పోలిగాడి జాడ-యిప్పుడు మీరంతా పెద్దగా పొగడి బ్రహ్మాండంగా చెప్పు కొంటారే- మెంటల్ ఆస్పత్రి కేసని-ఆ కేసులో ఒక ముఖ్య సాక్షిగా-దర్శన మైంది. ఈ కేసు దేశాన్నంతా గగ్గోలెత్తించింది. ఒక జమీందారు తన అన్న కొడుక్కు ఆస్తి పంచవలసి వస్తుందని కుట్ర పన్నాడు. ఆ కుట్రద్వారా అన్నకొడుకు-ఒక నూనూగు మీసాల యువకుడు పిచ్చి ఆస్పత్రిలో వున్మాదిగా చేర్చబడ్డాడు వారం రోజుల్లో అతను ఆస్పత్రిలోనే చనిపోయాడు. వెంటనే-తగు విలంబనం లేకుండానే- జమీందారు దహనక్రియలు జరిపించాడు. మరు గంటలోనే-ఆ యువకుడి మేనమామ-యిది హత్య-అని పోలీసు బలగాన్ని ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిల్చి మిన్ను మన్ను ఏకంగా జమీందారును శిక్షింపజేయాలని కంకణం కట్టుకొన్నాడు. ఆ క్రిమినల్ కేసులో లాయర్ని నేను. మేనమామ తరవున, చనిపోయిన నిర్భాగ్య యువకుడి తరపున, హేమా హేమీ బారిష్టర్లతో నేను పోరాటానికి తలపడ్డాను.

ఆ జమీ వారసుడి మరణం—కలరావల్ల— అని ఆస్పత్రి అధికారుల వాదం. అందువల్లనే శవాన్ని తక్షణం దహనక్రియల కిచ్చేశామన్నది. వాళ్ళ ప్రథమసాక్షి- పిచ్చాసుపత్రిలో ప్రత్యేక వార్డులో పనిచేస్తున్న ఒక వార్డరు. ఈ సాక్షిని వూపేశామా వాళ్ళ రక్షణంతా మట్టిపాలవుతుంది. ఆ సాక్షి పేరు-నీలయ్య.

నీలయ్య బోనులో నిలబడి ప్రమాణం చేస్తున్నప్పుడు, నా ఆశ్చర్యా నికి హద్దు లేకపోయింది. వాడు నీలయ్య కాదు. ఆనాటి మోసకారి పోలిగాడు! నాకు అదను చిక్కింది. ఆరు రోజులు- రోజుకు నాలుగైదు గంటల చొప్పున-నీలయ్య అనే పోలిగాణ్ణి నాకతినమైన క్రాసు పరీక్షకు గురి చేశాను. ఏ సామాన్య వ్యక్తి అయినా యీ పరీక్షకు పిచ్చివాడై పోయేవాడు; మూర్ఛపోయేవాడు. నరాలు కుప్పగా చప్పగా కూలిపోయేవి. కాని నీలయ్య అనే పోలిగాడు, గాలి వానకు తట్టుకొన్న తెప్పలాగా నిలబడ్డాడు. వాడి పాత కేసును యిందులో కీడ్చాను. వాడి పాత పేరును యిందులోకి లాగి, వాడి నోటినుండే ఆ పేరు నుచ్చరింప జేయాలని ప్రయత్నించాను. కాని లాభించలేదు. కోర్టువారు నా ప్రశ్నల్లో అనేక భాగాలకు ఆక్షేపణ తెలిపారు. వాడి పాత కేసు రికార్డులో వీడి సంతకం, వేలిముద్ర, ఫోటో ఏదీ దొరకలేదు. పోలిగాణ్ణి నేను నీలయ్యే నని ఒప్పుకోవలసి వచ్చింది.

నిజంగా జమీ కేసులో న్యాయమైన, బలమైన సాక్ష్యం మరుగుపడింది యువకుడి దహనంతోనే. మాకు చాలా బలహీనమైన సాక్ష్యం దొరికింది. కాని వార్డరు నీలయ్య సాక్ష్యం ప్రకారం పిచ్చి యువకుడు—దినంవలె కార్లో షికారుకు తీసుకుపోబడ్డాడని, దారిలో మామిడి పళ్ళు కొనిపించి తిన్నాడని, తిరిగి వచ్చి వాంతుల్తో ఆ రాత్రి బాధపడి తెల్లవారు జామున చచ్చి పోయాడని కలరా అని నిర్ధారించి మందిచ్చినట్లుగా డాక్టరు చెబుతున్నాడు. మరి నీ రోగిని కార్లో షికార్లు తిప్పిం దెందుకు? అంటే—అది చికిత్సా విభాగం అన్నాడు. ఆస్పత్రిలో పాత కేసుల రికార్డంతా కదిపించాం. కాని, పోలిగాడు దొరకలేదు. పోలిగాడుగా మా కేసు పోయింది. అయితే నేం—ఆస్పత్రి నిబంధనలలో అనేక సంస్కరణ లొచ్చినై, డాక్టరుకు మెడికల్ అధికార్లు వార్నింగ్ యిచ్చారు, వార్డరుమీద అంత బాధ్యత వుంచరాదని జడ్జి రాశాడు. నీలయ్య వుద్యోగం పోయింది గాని ఆ యువకుడి మేనమామ నాకు చెప్పిందేమంటే—యీ ప్రధాన సాక్షికి జమీందారు వేలల్లో పరిహారం కిందా యీనాం కింద యిచ్చాడని.

కొద్ది రోజుల్లోనే—మన పట్నంలోనే—నీలి నాయుడనే కంట్రాక్టరు అట్టహాసంగా పెద్ద పెద్ద కంట్రాక్టు పనులు మొదలు పెట్టాడు. అదృష్టానికి యుద్ధం వచ్చింది యింతలోనే. అటు ప్రభుత్వాన్ని, మిలిటరీ అధికార్లను. ఇటు తనకోసం చెమటోడ్చిన కూలి నాలి జనాన్ని మోసగించి, లంచాలతో, అంతఃకరుణ లేని అధికార్ల సాయంతో లక్షాధికారి అయినాడు. ఆ తర్వాత చరిత్ర నడుస్తున్న చరిత్ర." అని ప్లీడరుగారు ముగించారు.

* * *

మర్నాడు నేనూ, కమిటీలో కొందరమూ ప్లీడరుగారి షష్టిపూర్తి వుత్సవాల కయిన వసూళ్ళు—ఖర్చులు చూసి లెక్కలు ఒక కొలిక్కి తెద్దామని నీలినాయుడింటికి వెళ్ళాం. ఆయన దగ్గరే—లెక్కలు, రసీదు పుస్తకాలు వున్నాయ్. నీలినాయుడు చేతులు జోడించి యిట్లా అన్నాడు—"క్షమించాలి బాబయ్యా! మా బుర్ర లేని పనోడు రసీదు పుస్తకాలన్నీ ఏవో పాత కాయితాలని తగలెట్టేశాడు. ఏదో బడుగు పేదను పెద్దల ఆశీర్వచనంవల్ల యిట్లా వున్నాను. తగిత్తే నావే నాలుగొందలు తగిలినయ్యేమో! వారు పెద్దలు. చంద్రుడికి నూలుపోగు సామెత—అదే నేం చేయగలిగింది" O

(ఆంధ్రప్రభ దినపత్రిక : 15-9-1957)